# అనామకులు



లోకాన
నలుగురో పదిమందో
ధీరులు, పరమయోగులు
జ్ఞానులు, తాత్వికులు
నాయకత్వం వహించి
పదిమందికీ దారి సూపగలవారు
ధీమాగా ముందు నడుస్తారు
మంచిజీవితం ఎలావుండాలో
happiness అంటే ఏమిటో
శాస్త్రనిర్ణయాలు చేస్తారు.

ఆవెనక
అనేకానేక జనానీకం
ముందువారందించిన
పడికట్టురాళ్లు
నెత్తిన పెట్టుకు
వారి భాషణలే
వల్లె వేసుకుంటూ
ఆవుప్పే వెనకవారిక్కూడా
పంచిపెడుతూ
పరమానందంగా
ముందుకి సాగిపోతారు.

మూడోరకం ఉన్నారు
ఎందునా పొందనివారు
ఏ దిక్కూ తోచని వారు
దారిపక్కన
క్రీనీడన పొంచుని
ఆశ్చర్యంతోనో
అమాయకత్వంతోనో
అయోమయంగానో
అసహాయంగానో
నిలబడిపోతారు –
ముందు నడుస్తున్న
నాయకుల్నీ
ఆవెనక
ఉత్సాహంగా
ఉరకలేస్తూ
సాగిపోతున్న
జనాళినీ
చూస్తూ
Alice in Wonderland లాగ
అంతరార్థాలు వెతుక్కుంటూ

వాళ్ళు
వూరూ పేరూ లేనివాళ్లు
నెత్తిన రూపాయి పెడితే
దమ్మిడీకి చెల్లనివాళ్లు
గడ్డిగవ్వ విలువ చెయ్యని వాళ్లు
అయితే
వారివల్ల కూడా
ఉందో లాభం
ప్రతి మార్గదర్శకుడికీ
చుట్టూచేరిన భజనపరుల్తోపాటు
మరో మంద కూడా
ఉంటేనే సంతృప్తి
ముగ్గులోకి దింపడానికి

ఎలక్షన్లలో ఓటర్లలా
అప్పుడే నాయకులకి
తమ గోల్స్‌తో
పరిపూర్ణ తాదాత్మ్యం!

--నిడదవోలు మాలతి